జగనన్నతోనే ప్రజలకు మేలు

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఉద్ఘాటన
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డులు ఆవిష్కరణ



నందిగామలో 'వై ఏపీ నీడ్స్ జగన్' బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్


కొణతాలపల్లిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


జగ్గయ్యపేటలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న సామినేని వెంకటకృష్ణప్రసాద్, నాయకులు

నందిగామ టౌన్: మానవ వనరులపై పెట్టుబడి లేకుండా స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రగతి సాధ్యం కాదని గ్రహించి అందుకనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. నందిగామ పట్టణంలోని 13, 14వ వార్డుల పరిధిలోని ఏడో సచివాలయం, చందర్లపాడు మండలం చింతలపాడులో గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలతో ఉన్న డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా సంక్షేమ పథకాల అమలులో మాత్రం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వెనుకడుగు వేయలేదన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా సంక్షేమ పథకాల అమలులో పార్టీలు, కులమతాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆయా కూడళ్లలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పాకలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, కౌన్సిలర్ గద్దె శేషుకుమారి, వార్డు కన్వీనర్ నాదెండ్ల నరేంద్ర, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ జానీ, నాయకులు ఈశ్వరప్రగడ రంగారావు, గద్దె రమేష్, బండారు వెంకట్రావ్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జయంతిపురం(జగ్గయ్యపేట): అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. జయంతిపురం సచివాలయం వద్ద గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు అమలు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాహోరు నరసింహారావు, మండల సచివాలయ కన్వీనర్ షాబుద్దీన్, నాయకులు బాణావత్ పాండు, నరసింహారావు, బాలాజీ, ప్రకాష్, రమేష్, మస్తాన్, నాగభూషణం, సుబ్బారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దమోదుగపల్లికి రూ.22.80కోట్ల లబ్ధి

పెద్దమోదుగపల్లి(వత్సవాయి): మండలంలోని పెద్ద మోదుగపల్లిలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచి కల్యాణం విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలోని లబ్ధిదారులకు రూ.22.80కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల అభ్యున్నతికి కృషిచేస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని గ్రామస్తులను కోరారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కల్యాణం నాగరాజు, పాల సొసైటీ అధ్యక్షులు రామారావు, పంచాయతీ కార్యదర్శి చాందుసాహెబ్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొణతాలపల్లిలో..

కొణతాలపల్లి(వీరులపాడు): విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన అమ్మఒడి పథకంతో అక్షరాస్యతా రేటు పెరుగుతుందని నోబెల్ అవార్డు గ్రహీత జాన్ బి.గూడెనఫ్ ప్రశంసించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనితీరుకు నిదర్శనమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని కొణతాలపల్లిలో గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నిరుపేదలకు మంచి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి ప్రజల హృదయాలలో సుస్థిరస్థానం ఏర్పరచుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రగతిని కాంక్షించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రతి ఒక్క కార్యక్రమానికి ప్రశంసలు అందుతున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సైతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన ప్రతి ఒక్క సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నండ్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు ఐలూరి వెంకట్రావమ్మ, ఉప సర్పంచ్ ఐలూరి నర్సిరెడ్డి, ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ నువ్వు విశ్వనాథం, ఎంపీడీవో అరుంధతీ దేవి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చెవిటికల్లులో...

కంచికచర్ల : టీడీపీ చెప్పే మాయమాటలతో ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని చెవిటికల్లు గ్రామంలో గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ముందుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచి, సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామ సచివాలయం, వార్డు సచివాలయాలను సందర్శించి ఆయా సచివాలయాల పరిధిలో వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలను డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీలు వెలగలేటి మాధవి, బండి మల్లికార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు మంగిసెట్టి పుల్లారావు, నాయకులు బుడ్డి సత్యనారాయణ, వెలగలేటి వాసు, బాబు, మోహనరావు, మంగలపూడి కోటిబాబు, మార్త శ్రీనివాసరావు, మంగలపూడి సన్నీ, నాగుల్ మీరా, సత్యం, కార్యదర్శి మీర్జావలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జయంతిపురంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, సిబ్బంది


చెవిటికల్లులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

పేదల జీవితాల్లో వెలుగులు


జగ్గయ్యపేటలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత మేలు చేశారో సవివరంగా చెప్పడానికే 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 3,4వార్డులకు సంబంధించి మూడో సచివాలయం పరిధిలో పుట్టబజారులో గురువారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వార్డులకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్రల కలిసిలాయన ఆవిష్కరించారు. సచివాలయం కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసి సభలో సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పేదల జీవితాలు బాగుపడాలన్నా, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా అది ఒక్క వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు రానున్న రోజుల్లో కూడ మరింత మేలు జరగాలంటే మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వం నాటి ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీల మేనిఫెస్టోను ఏడాదిలోనే వెబ్‌సైట్‌లో నుంచి మాయం చేసిన విషయాన్ని గుర్తుచేసుకోవాలని కోరారు. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంటింటికి అందిన సంక్షేమ లబ్ధిని బ్రోచర్లు, డిస్‌ప్లేలో చూపించే సత్తా, దమ్ము ఉన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేటలో టీడ్కో ఇళ్ల పనులను సగం మాత్రమే చేసి కంట్రాక్టర్లకు సైతం డబ్బులు ఇవ్వకుండా అప్పటి పాలకులు నిర్లక్ష్యం చేయగా, కాంట్రాక్టర్లను సొమ్ములు చెల్లించినది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని గుర్తుచేశారు. మూడో సచివాలయం పరిధిలో ప్రజలకు రూ.2 కోట్ల మేర సంక్షేమం ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. వార్డు కౌన్సిలర్ కాశి అనురాధ కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా చేనేతవిభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, సచివాలయం కన్వీనర్ పందిటి కోటేశ్వరరావు, తిరుమలగిరి దేవస్థాన మాజీ చైర్మన్ రాధా సుబ్రహ్మణ్యం, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, కాశి కిషోర్, తోట శంకర్, వేల్పుల ప్రసాద్, కృష్ణమూర్తి, బూసిరెడ్డి రాజ్యలక్ష్మి, వేల్పుల రాజ్‌కుమార్, పల్లెపోగు రామారావు, గుడ్ల రామారావు, రఘు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రభుత్వ విప్ ఉదయభాను


ఉదయభానును సన్మానిస్తున్న ఆర్టీసీ కార్మికులు, యూనియన్ల నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. పేట ఆర్టీసీ డిపోలో కొంత కాలంగా కార్మికులపై డిపో యాజమాన్యం పనిభారం పెంచడంతోపాటు అదనపు డ్యూటీలు వేస్తోందంటూ కార్మికులు రెండు రోజుల కిందట ఎమ్మెల్యే ఉదయభానుకు ఫోన్ ద్వారా సమస్యలను తెలియజేశారు. కార్మికులకు అదనపు డ్యూటీలు వేయడంతో పనిభారం పెరిగిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పేట డిపో నుంచి సుదూర ప్రాంతాలకు నడిపే బెంగుళూరు, విశాఖపట్నం, తిరుపతి, శ్రీశైలం, కాకినాడ తదితర సర్వీసులను రద్దు చేస్తామని డిపో అధికారులు పేర్కొన్న విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్టీసీ ఆర్ఎం వై.దానం, డీవైసీటీఎంతో మాట్లాడారు. సుదూర ప్రాంతాల సర్వీసులను రద్దు చేయవద్దని, కార్మికులకు అదనపు డ్యూటీలు తగ్గించాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఆర్టీసీ అధికారులు సైతం కార్మికులకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆర్టీసీ ఎంఎస్‌యూ, ఎంప్లాయిస్ యూనియన్ తదితర యూనియన్ల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఉదయభానును గురువారం ఆయన నివాసంలో ఆయనను ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

మాట నిలబెట్టుకోవడం వైఎస్సార్ సీపీ నైజం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


ఎంపీపీ నాగమల్లేశ్వరిని సత్కరిస్తున్న అరుణ్‌కుమార్

చందర్లపాడు(నందిగామ టౌన్): మాట తప్పకుండా..మడమతిప్పకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నైజమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. చందర్లపాడు ఎంపీపీగా ఎన్నికైన గుడేటి నాగమల్లేశ్వరీ అభినందన సభను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో గుడేటి నాగమల్లేశ్వరికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ నాగమల్లేశ్వరికి సూచించారు. ముఖ్యంగా పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికీ అన్యాయం జరగదని, కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందన్నారు. అందుకు నాగమల్లేశ్వరి ఎంపీపీ కావడమే నిదర్శమని పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గంలో మరోసారి కూడా పార్టీ పతాకాన్ని రెపరెపలాడించబోతున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని సూచించారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సమున్నత ఆశయంతో రాజకీయాలలోకి వచ్చామని జగన్‌మోహనరావు, అరుణ్‌కుమార్ తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నందిగామ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. కానీ ప్రతిపక్ష టీడీపీ నాయకులు మాత్రం అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన నాగమల్లేశ్వరీని ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీలు రమాదేవి, కల్పన, బుగ్గినేని సురేష్, కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, నల్లాని సాయి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వక్తృత్వ పోటీలకు హాజరైన విద్యార్థులు


వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

నందిగామ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నందిగామ శాఖా గ్రంథాలయంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితంలో గ్రంథాలయం అవసరం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీలకు పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఆయా పోటీలను గ్రంథాలయ పాలకుడు షేక్ మస్తాన్‌వలి పర్యవేక్షించారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 64మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. విద్యారంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. పుస్తక పఠనం, గ్రంథాలయాల ఆవశ్యకత గుర్తించి, గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ గ్రంథపాలకుడు రంగిసెట్టి రంగారావు, ఎం.కనకారావు, జిల్లి కారల్‌మార్క్స్, బీడీసీలు శ్రీనివాసరావు, పేరయ్య, వరలక్ష్మి, నాగరాణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

నాలుగు బైక్‌లు, రూ.13వేలు నగదు స్వాధీనం

కంచికచర్ల : పేకాట నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కంచికచర్ల ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. నందిగామ ఏసీపీ జనార్దననాయుడు, రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ ఆదేశాల మేరకు కంచికచర్ల మండలంలోని మున్నలూరులో పేకాట శిబిరంపై గురువారం రాత్రి దాడులు చేసి పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నాలుగు బైక్‌లతోపాటు రూ.13,190 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

సాధికార యాత్రపై నేడు సన్నాహక సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్‌సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార యాత్ర ఈనెల 24వ తేదీన జగ్గయ్యపేట పట్టణంలో జరగనున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు వైఎస్సార్ సీపీ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఉదయభాను కార్యాలయం గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల ఆవరణలో జగ్గయ్యపేట పట్టణం, మండలంలోని పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, సొసైటీల అధ్యక్షులు, పట్టణ, మండల, గ్రామాల పార్టీ అధ్యక్షులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

హుండీ ద్వారా రూ.15.12 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారికి హుండీ ద్వారా రూ.15.12లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో జయప్రకాష్ బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. మూడునెలల 13రోజులకు హుండీ ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీతారావమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాటరీ దొంగల ముఠా అరెస్ట్

నందిగామ: ఆగిఉన్న లారీల బ్యాటరీలో చోరీ చేస్తున్న ముఠాను నందిగామ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. నందిగామ పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్ కథనం మేరకు.. పెనుగంచిప్రోలు మండలంలోని పలు గ్రామాలకు చెందిన పి.రాము, ఎం.ఉపేంద్ర, ఎం.లక్ష్మీ తిరుపతిరావు, ఎ.శివ, ఎం.కృష్ణ, ఎం.మోహన్, జి.యేసురాజు ఓ ముఠాగా ఏర్పడి నందిగామ, పెనుగంచిప్రోలు, చందర్లపాడు మండలాల్లో ఆగి ఉన్న లారీల బ్యాటరీలను దొంగిలిస్తున్నారు. బ్యాటరీలో దొంగతనాలపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిందితులు నందిగామ శివారు అనాసాగరం వద్ద ఆపి ఉన్న ఓ లారీ నుంచి బ్యాటరీలను దొంగలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 33బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హనీష్ వివరించారు.

క్లుప్తంగా

చందర్లపాడు ఎంపీపీగా గుడేటి నాగమల్లేశ్వరి



చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండల పరిషత్ అధ్యక్షురాలిగా వెలదికొత్తపాలెం ఎంపీటీసీ సభ్యురాలు గుడేటి నాగమల్లేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ వేల్పుల ఏశమ్మ అనారోగ్య కారణాలతో రాజీనామా చేయడంతో ఆమెస్థానంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. మొత్తం 17మంది ఎంపీటీసీ సభ్యులుండగా 13మంది సభ్యులు పాల్గొని నాగమల్లేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఆమెకు నియామకపత్రం అందజేశారు. అనంతరం నాగమల్లేశ్వరిచే పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వత్సవాయిలో 'జగనన్నకు చెబుదాం'

వత్సవాయి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం పదిగంటలకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ కార్యాలయ ఏవో బి.రాజు గురువారం తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని సూచించారు. మండలస్థాయి అధికారులంతా సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఏవో కోరారు.

20న నందిగామ మండల పరిషత్ సమావేశం

నందిగామ: ఈనెల 20వ తేదీన నందిగామ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు అరిగెల సుందరమ్మ అధ్యక్షతన ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పెండ్యాల పాఠశాల తనిఖీ



పెండ్యాల(కంచికచర్ల) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ సూచించారు. మండలంలోని పెండ్యాల ఎంపీయూపీ స్కూల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలించారు. విద్యార్థులకు కొద్దిసేపు మ్యాథ్స్ బోధించారు. ఈసందర్భంగా ఎంపీపీ మలక్‌బషీర్ మాట్లాడుతూ.ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. డిజిటల్ క్లాసుల ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతోందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందించాలని సూచించారు. ఎంఈవో బి.బాలాజీ, మాజీ సర్పంచి షమీ, నాయకులు గులాం ఖాదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిమితికి మించిన ప్రయాణికులతో ఫీట్లు



నందిగామ: మండలంలో కొందరు ఆటోడ్రైవర్లు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తూ ఫీట్లు చేస్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదమని తెలిసినా కూడా డ్రైవర్ సీటుకు ఇరువైపులా ప్రయాణికులను ఎక్కిస్తుండటంతో వెనుకవైపు నుంచి వచ్చే వాహనాల కదలికలు సరిగా తెలియక కొన్నిసార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు ఆటోవాలాలు అధిక సంఖ్యలో ప్రయాణికులతోపాటు లౌడ్ స్పీకర్లు కూడా ఏర్పాటు చేసుకుని ఓవర్ స్పీడ్‌తో నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతుండటం ప్రమాదభరితంగా మారింది. ప్రమాదం జరిగినప్పుడు బాధపడే కన్నా ముందే జాగ్రత్తగా ఉంటే అందరికీ మంచిది అంటూ 'ఆటో అన్నా.. జరభద్రం' అంటున్నారు వాహనచోదకులు.

సాయిబాబాకు పూజలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వరనగర్ సాయిబాబా ఆలయంలో కార్తీకమాసం మొదటి గురువారం నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే ఆలయ అర్చకులు బాబాకు పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సమయంలో స్వామివారికి పాదుకుల సేవ నిర్వహించారు.